రహదారి నిర్మించండి !

- అధ్వానంగా దావు బుచ్చయ్యకాలనీ – గుణదల రోడ్డు
- రాకపోకలకు తప్పని తిప్పలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్యకాలనీ – గుణదల రహదారి పనులు పూర్తి చేయకపోవటంతో వాహనచోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దేవీనగర్, జీవీఆర్‌నగర్, బుడమేరు మధ్య కట్ట, విజయదుర్గానగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంత వాసులు గుణదల, ఆటోనగర్, రామవరప్పాడు వెళ్లేందుకు ఈ మార్గం దగ్గర దారి కావటంతో ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. గుణదలలోని డాన్‌బాస్కో తదితర పాఠశాలలకు విద్యార్థులు ఈ గుంతల రోడ్డుమీదుగా రాకపోకలు చేస్తున్నారు. రోడ్డు గుంతలు పడి ఉండటంతో పాటు దుమ్ముకొట్టుకు పోయి ప్రమాదకరంగా మారింది. దీంతో తరచూ ఈ మార్గంలో వాహన చోదకులు గుంతల్లో పడి గాయాలబారిన పడుతున్నారు. అలాగే దుమ్ములేచిపోవటంతో శ్వాస కోశ వ్యాధులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ రోడ్డును సరిచేయాలని ఎన్ని మార్లు అధికారులకు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకున్న వారే కరువయ్యారని వాహన చోదకులు వాపోతున్నారు. రోడ్డు గుంతలు పడి ప్రమాదకరంగా ఉండటంతో పలువురు చుట్టూ తిరిగి గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ఇక్కడ రోడ్డును సరిచేసి రాకపోకలకు వీలుగా చేయటం వల్ల ట్రాఫిక్ సమస్యలు సైతం కొంత మేర తగ్గే అవకాశం ఉంది.



దావు బుచ్చయ్యకాలనీ - గుణదల రోడ్డు



రోడ్డు పక్కన పడవేసిన వ్యర్థాలు

చినుకు పడితే చిత్తడే..

ఇక్కడ మట్టి, గ్రావెల్ రోడ్డు కావటంతో చినుకుపడితే చిత్తడిగా మారి ప్రమాదకరంగా మారిపోతుందని వాహన చోదకులు ఆరోపిస్తున్నారు. కొద్దిపాటి వర్షాలకే రోడ్డు బురదమయంగా మారుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రామకృష్ణాపురం నుంచి గుణదల వరకు రోడ్డు విస్తరణచేసి రోడ్డు వేసేందుకు అవసరమైన నిధులు అప్పటి ఎమ్మెల్యే మల్లాది విష్ణు మంజూరు చేశారు. ఇందుకుగానూ రోడ్డు వేసేందుకు అవసరమైన స్థలం సేకరించేందుకు గానూ కొంత మంది స్థల యజమానులకు బాండ్లు సైతం జారీ చేశారు. కానీ అధికారుల నిర్లక్ష్యం వల్ల రోడ్డు పనులు కేవలం దావు బుచ్చయ్యకాలనీ వరకు మాత్రమే వేసి వదలేశారు.

ప్రమాదకరంగా రోడ్డు..



గుణదల, రామవరప్పాడు తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ మార్గం దగ్గరి దారి కావటంతో రాకపోకలు సాగిస్తున్నాం. అయితే ఇక్కడ రోడ్డు గుంతలు పడి మట్టి లేచి ప్రమాదకరంగా ఉంది. గోతుల వల్ల విలువైన వాహనాలు తరుచూగా మరమ్మతులకు గురవుతున్నాయి.

–నాళి తిరుపతయ్య, జీవీఆర్‌నగర్

రాకపోకలకు ఇబ్బంది..



మా పిల్లలు గుణదలలోని స్కూలులో చదువుతున్నారు. దీంతో గోతులు ప్రమాదకరంగా ఉన్నప్పటికీ ఈ మార్గం మీదుగానే రాకపోకలు సాగిస్తున్నాం. నిత్యం వందలాది మంది చిన్నారులు ఈ మార్గం మీదుగానే స్కూలుకు వెళ్తున్నారు. ఇక్కడ రోడ్డును సరిచేసి రాకపోకలకు వీలుగా చేయాలి

– కొత్త వెంకటరెడ్డి, దావు బుచ్చయ్యకాలనీ

రోడ్డు పక్కనే వ్యర్థాలు

రోడ్డు పక్కనే భవన, సెప్టిక్ వ్యర్థాలు వేస్తున్నారు. దీని వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారటంతో పాటు దుర్వాసన వెదజల్లుతున్నాయి. అలాగే బుడమేరులో తీసిన వ్యర్థాలను సైతం రోడ్డు పక్కనే వేస్తున్నారు. అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

పోలీస్ ప్రజావాణిలో 135 ఫిర్యాదులు



విజయవాడస్పోర్ట్స్: విజయవాడలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(ప్రజావాణి)లో ప్రజల నుంచి 135 ఫిర్యాదులను స్వీకరించినట్లు డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ) ఏబీటీఎస్ ఉదయరాణి తెలిపారు. ఆర్థిక వివాదాలు 30, కుటుంబ కలహాలు 25, ఆస్తి వివాదాలు 22, మహిళా సంబంధిత నేరాలు 18, మోసాలు 13, చోరీలు, కొట్లాటలు 9, ఇతర ఘటనలు 18 మంది నుంచి అర్జీలను తీసుకున్నామన్నారు. ఫిర్యాదులను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను డీసీపీ ఆదేశించారు.

మైనార్టీ 'గురుకులం'లో ప్రవేశాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో భవానీపురంలో నిర్వహిస్తున్న ఏపీఆర్ఎస్ మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.శివకుమారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 40 సీట్లు, 6, 7, 8 తరగతులలో(బ్యాక్ లాగ్) మిగిలి ఉన్న సీట్ల కోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సీట్ల భర్తీలో ముస్లిం (బీసీ–ఈ, బీసీ–బీ, బీసీ–సీ (కన్వర్టెడ్ క్రిస్టియన్) విద్యార్థినులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని, ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో httpr://aprrapcfrr.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఏజిల్లాకు చెందిన విద్యార్థి అయిన దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. మరిన్ని వివరాలకు 87126 25036 నంబర్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సూర్యారావుపేట సెక్షన్ జూబిలీ ఇండోర్ సబ్ స్టేషన్ 11 కేవీ కస్తూరిబాయిపేట ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం 11వ తేదీ మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7:30 నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. గోపాలరెడ్డి రోడ్డు, రైల్వే క్లబ్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీస్, ఇంటెలిజెన్స్ ఆఫీస్, కస్తూరిబాయిపేట, పుష్పా హోటల్ ఏరియా, కాళేశ్వరరావు రోడ్, ప్రకాశం రోడ్, లతా సూపర్ స్పెషాలిటీ హస్పిటల్ ఏరియా, పొగాకు బ్యారెన్ రోడ్, చలసాని వెంకటకృష్ణయ్య వీధి, కస్తూరిబాయి పేట బెల్లపు శోభనాద్రి వీధి, రామనాథం వీధి, చలమల వారి వీధి ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): 60వ డివిజన్ వాంబే కాలనీ కల్యాణ మండపంలో జీఓ నంబర్ 105తో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ చేసుకున్న లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీను నెరవేరుస్తున్నామని తెలిపారు. ప్రతి డివిజన్‌లోని సమస్యలను పరిష్కరిస్తున్నానని, నియోజకవర్గాన్ని ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దటమే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కంచి దుర్గ, కంచి ధనశేఖర్, ఘంటా కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారమే లక్ష్యం

పీజీఆర్ఎస్‌లో వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



పటమట(విజయవాడతూర్పు): ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ఆయన నగరవాసుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను శాఖాధిపతులు, జోనల్ అధికారులు, సచివాలయం సిబ్బందితో సమస్యలను చర్చించి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందులో మొత్తం 21 ఫిర్యాదులు రాగా అందులో ప్రధానంగా పట్టణ ప్రణాళిక విభాగంపై-05, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌పై-02, ఇంజినీరింగ్‌పై-11, ప్రజారోగ్య విభాగంపై -02, ఎస్టేట్ విభాగంపై-01 ఫిర్యాదు వచ్చింది. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ) జి. సృజన, చీఫ్ ఇంజినీర్ శ్రీనాథ్ రెడ్డి, సూపరింటెండింట్ ఇంజినీర్లు పి.సత్యకుమారి, పి.సత్యనారాయణ, డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

యువత పోరుకు తరలిరావాలి

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు



'యువత పోరు' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న 'యువత పోరు'కు విద్యార్థులు, యువత, వారి తల్లిదండ్రులు పెద్దఎత్తున తరలిరావాలని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో 'యువత పోరు' పోస్టర్లను డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లతో కలిసి సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్, నిరుద్యోగ భృతి, మెడికల్ కాలేజీల నిర్వహణ అంశాలపై చంద్రబాబు ప్రభుత్వం అవలంభిస్తోన్న నిర్లక్ష్య ధోరణిపై ఈనెల 12న కలెక్టర్లకు వినతిపత్రం అందజేస్తామన్నారు. ఇప్పటికే పెంచిన విద్యుత్ చార్జీలు, రైతులకు గిట్టుబాటు ధరలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున పోరాటం చేసిందని గుర్తుచేశారు. అలాగే నిరుపేదల విద్య కోసం మరోసారి పోరుబాట పట్టిందని వెల్లడించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 12న బీసెంట్ రోడ్డులోని పాత కార్యాలయం వద్ద 9 గంటలకు పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం ర్యాలీగా కలెక్టర్ కార్యాలయానికి తరలివెళ్తామన్నారు. రూ.4,600 కోట్ల బకాయిలు ఇప్పటికీ విడుదల చేయకపోవడంతో విద్యార్థులను యాజమాన్యాలు కళాశాలల నుంచి బయటకు పంపుతున్నాయని చెప్పారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు కుట్ర

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్త మెడికల్ కాలేజీల విషయంలో వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గమని మల్లాది విష్ణు అన్నారు. ప్రతి జిల్లాకు ఒక వైద్య కళాశాలను తేవాలన్న సంకల్పంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.8 వేల కోట్లతో 17 కొత్త మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టగా.. 2023–24 సమయంలోనే 5 కాలేజీలను ప్రారంభించుకోవడం జరిగిందని తెలిపారు. మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయి ఉంటే, ఈ ఏడాది కూడా మరో 5 మెడికల్ కాలేజీలు అందుబాటులోకి వచ్చి ఉండేవన్నారు. కానీ కూటమి ప్రభుత్వ నిర్వాకం వల్ల అది జరగలేదని ఆక్షేపించారు. పైగా అధికారంలో ఉంటూ ఎంబీబీఎస్ సీట్లు పెంచవలసింది పోయి.. మంజూరైన సీట్లు వద్దనడం ఏమిటని ప్రశ్నించారు.

నిరుద్యోగ భృతి ఎక్కడ బాబూ..

నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగావకాశాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు.. గత 10 నెలల కాలంలో ఎంతమందికి కల్పించారో సమాధానం చెప్పాలని మల్లాది విష్ణు డిమాండ్ చేశారు. ప్రతి నెలా నిరుద్యోగులకు రూ.3 వేల చొప్పున ఇస్తామన్న భృతి ఏమైందని ప్రశ్నించారు. ప్రతి నిరుద్యోగికి ఈ ప్రభుత్వం రూ.72 వేలు బాకీ పడిందని తెలియజేశారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మాట్లాడుతూ.. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటోందన్నారు. ఫలితంగా చదువుకోవాల్సిన వారు కూలీలుగా, వ్యవసాయ పనులకు వెళ్లే విషయ పరిస్థితిని కూటమి ప్రభుత్వం కల్పిస్తోందని మండిపడ్డారు. తక్షణమే యువతకు ఇచ్చిన హామీలన్నింటినీ కూటమి ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శర్వాణీమూర్తి, ఇసరపు దేవి, ఎండీ షాహినా సుల్తానా, పార్టీ అనుబంధ సంఘాల నేతలు, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంధ్రా షిర్డీ వార్షికోత్సవం



కలశ పూజ నిర్వహిస్తున్న పూనూరు గౌతంరెడ్డి తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిర్డీగా విరాజిల్లుతున్న ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిర 37వ వార్షికోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు బాబాకు విశేషంగా పూజలు అభిషేకాలు, హారతులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. లోక కళ్యాణార్థం సహస్ర కలశ అభిషేకం జరిగింది. కార్యక్రమంలో మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి పాల్గొని బాబాకు కలశ అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతంరెడ్డి మాట్లాడుతూ గత 37 సంవత్సరాలుగా దాతలు, భక్తుల మనోభావాలకు అనుగుణంగా అధ్యాత్మిక, సేవాకార్యక్రమాలను నిర్వహిస్తూ ఆంధ్రా షిర్డీగా తీర్చిదిద్దామని తెలిపారు. షిర్డీలో మాదిరిగా ఇక్కడ అన్ని పూజలు నిర్వహించటంతో పాటు పలు సేవా కార్యక్రమాలు, నిత్యాన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. షిర్డీ వెళ్లి మొక్కులు తీర్చుకోలేని వారు ఇక్కడ మొక్కులు తీర్చుకోవటం బాబా మందిరం విశిష్టతను తెలియజేస్తోందని చెప్పారు. బాబావారి ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో బాబావారి ఊరేగింపు జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

షార్ట్ ఫిల్మ్ పోటీల్లో ఎస్ఆర్ఆర్ విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, అధ్యాపకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళల కోసం సైబర్ భద్రత అనే అంశంపై ఏపీ ప్రభుత్వం యువజన సేవల విభాగం ఏలూరు వారు నిర్వహించిన షార్ట్ ఫిల్మ్ పోటీల్లో కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించి రూ. 5వేలు నగదు బహుమతి, జ్ఞాపిక అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో విజేతలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె భాగ్యలక్ష్మి, అధ్యాపకులు అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరింత మెరుగైన ప్రదర్శనతో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. మిగిలిన విద్యార్థులు విజేతలను స్ఫూర్తిగా తీసుకుని నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.అరుణ, డి.జ్యోతి, దాస్ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

నగరాన్ని అభివృద్ధి పథంలో పయనింప చేస్తాం

మేయర్ రాయన భాగ్యలక్ష్మి



సమావేశంలో మేయర్ భాగ్యలక్ష్మి, సభ్యులు, అధికారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరాన్ని మరింత అభివృద్ధి దిశలో పయనింపచేసి ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తామని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం నిర్వహించిన స్థాయీ సంఘ సాధారణ సమావేశానికి మేయర్ అధ్యక్షత వహించారు. సమావేశం అజెండాలోని మొత్తం 58 అంశాలపై చర్చించి 46 అంశాలను ఆమోదించారు. అలాగే 7 అంశాలను వాయిదా వేయగా , రెండు ర్యాటిఫై, ఒకటి ధ్రువీకరణ, మరొకటి రద్దు, ఇంకొకటి రికార్డ్ చేయబడ్డాయి. ఈసందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అధికారులతో సమన్వయం చేసుకుని, ప్రజల భాగస్వామ్యంతో నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. నగరంలోని 64 డివిజన్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ముఖ్యంగా వేసవి కాలంలో తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో స్థాయీ సంఘ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఆమనగంటి సేవలు చిరస్మరణీయం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ ఎన్జీవో సంఘ వ్యవస్థాపక సభ్యునిగా, ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడిగా చైర్మన్‌గా, శాసనసభ్యునిగా ఆమనగంటి శ్రీరాములు అందించిన సేవలు చిరస్మరణీయమని ఎన్జీఓ అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ కె.వి.శివారెడ్డి అన్నారు. గాంధీనగర్‌లోని ఎన్జీవో హోంలో ఆమనగంటి జయంతి కార్యక్రమం సోమవారం జరిగింది. ఎన్జీవో నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎన్జీఓ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అలపర్తి విద్యాసాగర్ మాట్లాడుతూ.. ఆమనగంటి శ్రీరాములు చేసిన పోరాటం ఫలితంగా ప్రభుత్వం నుంచి సాధించుకున్న ఎన్నో హక్కులను సౌకర్యాలను నేడు ఉద్యోగులు పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్జీవో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.జగదీశ్వరరావు, వి.దస్తగిరి రెడ్డి, రంగారావు, సత్యనారాయణ రెడ్డి, పి.రమేష్, సీవీఆర్ ప్రసాద్, నజీరుద్దీన్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న హెచ్ఎం మైనం హుస్సేన్

పాయకాపురం(విజయవాడరూరల్): విద్యార్థులు మారుతున్న పరిస్థితులకనుగుణంగా నూతన ఆవిష్కరణలు తయారు చేయాలని జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఆప్కాస్టు ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని నూతన ఆవిష్కరణలు తయారు చేసి గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణలు తయారు చేయడం దిశగా ఆసక్తి చూపాలన్నారు. పోస్టర్ ప్రజెంటేషన్, మోడల్ తయారీ పోటీలను నిర్వహించగా 10 మంది విద్యార్థులు గెలుపొందారని తెలిపారు. జీడీఈటీ మున్సిపల్ హైస్కూల్, నున్న జిల్లా పరిషత్ హైస్కూళ్లు కూడా విద్యార్థులకు పోటీలు నిర్వహించాయన్నారు. ప్రతి పాఠశాల నుంచి 10 మంది విద్యార్థులను ఎంపిక చేసి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆయుర్వేద పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ ప్రజారోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11, 12 తేదీల్లో పరిశోధకులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని ఐలాపురం కన్వెన్షన్ సెంటర్‌లో శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. దేశంలోని ఎంపిక చేసిన రాష్ట్రాలలో వివిధ జాతులు, తెగలు, జన సమూహాలలో ఆహార అలవాట్ల సమాచార సంగ్రహణ తదితర అంశాల్లో శిక్షణ ఉంటుందని చెప్పారు. శిక్షణ కార్యక్రమాల్లో డాక్టర్ నారాయణం శ్రీకాంత్, డెప్యూటీ డైరెక్టర్ జనరల్, దేశంలోని కేంద్రీయ ఆయుర్వేద విజ్ఞాన పరిశోధనా సంస్థకు చెందిన పరిశోధకులు, ఆయుర్వేద నిపుణులు, శాస్త్రవేత్తలు హాజరవుతారన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో ఆయుర్వేద ప్రాముఖ్యతను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లడం ఈ కార్యక్రమం లక్ష్యమని చెప్పారు.

పేద ముస్లింలకు పెళ్లి పథకం అమలు చేయాలి



నియామక పత్రం అందజేస్తున్న షేక్ నాగుల్ మీరా

పాయకాపురం(విజయవాడరూరల్): పేద ముస్లింలకు పెళ్లి పథకం అమలు చేయాలని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కండ్రికలో ఆజాద్ ముస్లిం కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా నాగుల్‌మీరా మాట్లాడుతూ.. ఎన్నికల హామీలో భాగంగా పేద ముస్లింలకు పెళ్లి సందర్భంగా లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ షాదీ తోఫా పథకం కింద లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేశారని చెప్పారు. పేద ముస్లింలు వివాహం జరిగిన నెల రోజుల లోపు ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఆడపిల్ల తల్లిదండ్రుల బ్యాంక్ ఖాతాలో లక్ష రూపాయల సహాయం చేసి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకున్నారన్నారు. అదే విధంగా కూటమి ప్రభుత్వం పేద ముస్లింలకు పెళ్లి పథకం అమలు చేయాలన్నారు. అనంతరం 64వ డివిజన్‌కు చెందిన షేక్ నాగుల్ మీరాకు ఆయన ఆజాద్ ముస్లిం కమిటీ నగర ఉపాధ్యక్షులుగా నియమించి నియామక పత్రం అందజేశారు. పేద ముస్లింలకు సేవ చేయాలనే ఆలోచనతో కమిటీ లో సభ్యత్వం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సాజిద్ అలీ, నగర యూత్ అధ్యక్షుడు షేక్ నాగూర్, 61వ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎండీ రఫీ, సభ్యులు ఎండీ జానీ తదితరులు పాల్గొన్నారు.